తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

తెలంగాణ వెన్నెల వాక్కు విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :19 03-08- 2026 సోమవారం పేజీలు: 4 వెల:03/-

# లష్కర్ బోనాల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక పూజలు

## ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి సీఎం రేవంత్ రెడ్డి బోనం సమర్పణ

-- రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు
-- మంత్రులతో కలిసి పట్టువస్త్రాల సమర్పణ
-- భక్తులతో కిటకిటలాడిన మహంకాళి ఆలయం



హైదరాబాద్, ఆగస్టు 3: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి లష్కర్ బోనాల ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. వేలాది మంది భక్తుల జయజయధ్వానాల నడుమ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున జగన్మాతకు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు.

ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ముఖ్యమంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఆవరణలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ సీతక్క, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షించారు.

2

# 'నషా ముక్త్ యువ వికసిత్ భారత్'కు శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ

డ్రగ్స్ రహిత భారత్ కోసం 100 వారాల జాతీయ ఉద్యమం
యువత, తల్లిదండ్రులు, విద్యాసంస్థల భాగస్వామ్యంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు
2047 వికసిత్ భారత్ లక్ష్యానికి వ్యసన రహిత యువశక్తే బలమన్న ప్రధాని



న్యూఢిల్లీ బ్యూరో:
దేశ భవిష్యత్తుకు వెన్నెముకలాంటి యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. దేశాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో

2

# ఇరాన్--అమెరికా ఉద్రిక్తతలకు తెరపడేనా?

## యుద్ధానికి ముగింపు దిశగా కీలక పరిణామాలు.. ట్రంప్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా ఊరట



వాషింగ్టన్, ఆగస్టు 3:
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు దారితీసిన అమెరికా--ఇరాన్ ఘర్షణలు ముగింపు దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇరాన్‌పై ప్రతిపాదించిన సైనిక చర్యలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు సానుకూలంగా సాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీంతో గత కొన్ని రోజులుగా యుద్ధ భయాందోళనలతో ఉలిక్కిపడిన ప్రపంచ దేశాలకు కొంత ఊరట లభించినట్లైంది.

ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్లో స్పందిస్తూ, ఇరాన్ అణు కార్యక్రమంపై శాశ్వత పరిష్కారం, హర్మూజ్ జలసంధిలో సాధారణ రవాణా పునరుద్ధరణ, ప్రాంతీయ భద్రత వంటి

2

# వర్షాలు సమృద్ధిగా కురిసి.. పంటలు బాగా పండాలి

## బోనాల పూజల్లో అమ్మవారిని వేడుకున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



హైదరాబాద్ బ్యూరో:
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్న ఆషాఢ బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాష్ట్ర ప్రజల సుఖశాంతి, రైతాంగ సంక్షేమం కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

పూజల అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. రాష్ట్రంలో

2

# వచ్చే మూడేళ్లు నల్లగొండ అభివృద్ధే నా టార్గెట్

## నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నల్లగొండ బ్యూరో:
వచ్చే మూడేళ్లలో నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా కంచనపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

నల్లగొండ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అన్నారు. సాగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ పనులను త్వరితగతిన పూర్తి చేయడం తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో రెండు పంటలకు సరిపడా సాగునీరు అందుతుందని, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.

బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, మిగిలిన కాలువల నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రతి ఎకరానికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ

2

# డీలిమిటేషన్ బిల్లుకు మద్దతిస్తే చరిత్ర ద్రోహులే

## కేంద్రంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు.. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగొద్దని డిమాండ్



న్యూఢిల్లీ బ్యూరో:
నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. డీలిమిటేషన్ బిల్లును ఏకపక్షంగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే అది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చే వారు చరిత్రలో ద్రోహులుగా మిగిలిపోతారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో దేశానికి ఆదర్శంగా నిలిచాయని, ఇప్పుడు అదే రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గించేలా డీలిమిటేషన్ చేపట్టడం అన్యాయమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాలు అభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డాయని, కేవలం జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల సంఖ్యను నిర్ణయించడం వల్ల ఈ రాష్ట్రాలకు నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

భారతదేశం సమాఖ్య వ్యవస్థపై ఆధారపడిన దేశమని, అన్ని రాష్ట్రాలకు సమాన గౌరవం, సముచిత ప్రాతినిధ్యం ఉండాలని ఆయన అన్నారు. రాజకీయ

3

# తిరుమలలో రికార్డు స్థాయి హుండీ ఆదాయం

## జులైలో రూ.140.28 కోట్ల కానుకలు.. 24.52 లక్షల మంది శ్రీవారి దర్శనం



తిరుమల బ్యూరో:
కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిపై భక్తుల విశ్వాసం మరోసారి రికార్డు స్థాయిలో ప్రతిఫలించింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చరిత్రలోనే జులై నెలలో అత్యధిక నెలవారీ హుండీ ఆదాయం నమోదైంది. జులై నెలలో శ్రీవారి హుండీ ద్వారా రూ.140.28 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. ఒకే నెలలో ఈ స్థాయిలో హుండీ ఆదాయం రావడం ఇదే తొలిసారి కావడం విశేషం.

టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం జులై నెలలో దేశ విదేశాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తిరుమలకు తరలివచ్చారు. మొత్తం 24.52 లక్షల మంది శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు

4

## గౌతమ బుద్ధుని కర్మ సిద్ధాంతం మానవాళికి ఆచరణీయం:



ముధోల్, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రపంచానికి అహింస, శాంతి మార్గాలను ప్రబోధించిన గౌతమ బుద్ధుని కర్మ సిద్ధాంతం ప్రతి ఒక్కరూ ఆచరించదగినదని భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ గడపాలే అన్నారు. ముధోల్ పట్టణంలోని నాగార్జున నగర్ జేతవన్ బుద్ధ విహార్‌లో ఆదివారం భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో 'వర్షావాస్' కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌతమ బుద్ధుడు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు దీపప్రజ్వలన చేసి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మనిషి చేసే మంచి చెడు కర్మల ఆధారంగానే జీవిత ఫలితాలు ఆధారపడి ఉంటాయన్నారు. సమాజంలో ద్వేషం, అసూయ వీడి ప్రేమ, కరుణ, మైత్రి సూత్రాలను పాటించాలన్నారు. బుద్ధుని బోధనలను రోజువారీ జీవితంలో ఆచరిస్తే సమాజంలో సౌభ్రాతృత్వం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో బిఎస్ఐ జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు వాగ్మారే, నారాయణ వాగ్మారే, అప్పారావు వాగ్మారే పాల్గొన్నారు.

## ముధోల్ నియోజకవర్గంలో ఆనందోత్సాహాల నడుమ స్నేహితుల దినోత్సవం



ముధోల్, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల కేంద్రంతో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు సందడిగా సాగాయి. ఈ సందర్భంగా యువకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఒకరికొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుంటూ కేక్‌లు కట్ చేసి స్నేహబంధాన్ని చాటుకున్నారు.

కష్టసుఖాల్లో తోడుగా నిలిచే నిజమైన స్నేహాన్ని గౌరవించాలని పలువురు వక్తలు తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా మిత్రులు ఒకరికొకరు జ్ఞాపకాలను పంచుకుంటూ శుభాకాంక్షలు తెలపడంతో మండలంలో పండగ వాతావరణం నెలకొంది.

## సింహాచలం ఆలయ ఉత్సవాల్లో నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న నిర్మల్ చిన్నారి



నిర్మల్ ఆగస్టు 2(తెలంగాణ వెన్నెల వాక్కు):: నిర్మల్ పట్టణానికి చెందిన పసులోటి శ్రీకాంత్, ప్రియాంక దంపతుల కుమార్తె పసులోటి వంశిక విశాఖపట్నంలోని ప్రసిద్ధ సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలయ ఉత్సవాల్లో తన నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. నిర్మల్‌లోని స్వరూపిణి కళాక్షేత్రం బృందంతో కలిసి పాల్గొన్న వంశిక, భక్తి భావాన్ని ప్రతిబింబించే నృత్య ప్రదర్శనతో సభికుల ప్రశంసలు అందుకుంది. చిన్న వయసులోనే కళాప్రతిభను చాటుకున్న వంశికను ఆలయ నిర్వాహకులు, కళాప్రియులు అభినందించారు.

వంశిక ఈ ప్రదర్శన ద్వారా నిర్మల్ జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావడం పట్ల తల్లిదండ్రులు, గురువులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## లష్కర్ బోనాల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక పూజలు

లష్కర్ బోనాల సందర్భంగా సికింద్రాబాద్ నగరం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు తలపై రంగురంగుల పూలతో అలంకరించిన బోనాలను మోసుకుంటూ అమ్మవారికి సమర్పించగా, యువకులు పోతురాజు వేషధారణలో నృత్యాలు చేస్తూ భక్తులను ఆకట్టుకున్నారు. డప్పుల మోతలు, మంగళవాయిద్యాలు, శివసత్తుల విన్యాసాలు, జానపద కళారూపాలు జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తుల దృష్ట్యా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. తాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాలను కల్పించింది. పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టింది.

తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవంగా వెలసిన శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి లష్కర్ బోనాల జాతర రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే మహోత్సవంగా మరోసారి భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతోంది. ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరఫున బోనం సమర్పించడం ఈ ఏడాది ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

## ఇరాన్--అమెరికా ఉద్రిక్తతలకు తెరపడేనా?

అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రతిపాదిత ఒప్పందం త్వరగా ఖరారైతే సైనిక చర్య అవసరం ఉండదని, అయితే అమెరికా భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.ఇదే సమయంలో ఇజ్రాయెల్ కూడా శాంతి చర్చల ప్రక్రియకు సానుకూలంగా స్పందించినట్లు ట్రంప్ పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం వహిస్తున్న గల్ఫ్ దేశాల ప్రయత్నాలు ఫలిస్తున్నాయని, సమస్యను చర్చల ద్వారానే పరిష్కరించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అంతర్జాతీయ వర్గాలు తెలిపాయి.మరోవైపు, అమెరికా దాడులు జరిగితే తీవ్రంగా ప్రతిస్పందిస్తామని ఇరాన్ గతంలో హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే తాజా పరిణామాలపై ఇరాన్ ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అందువల్ల పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుందని చెప్పడానికి ఇంకా సమయం పడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గితే అంతర్జాతీయ చమురు మార్కెట్లపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. అలాగే పశ్చిమాసియాలో శాంతి నెలకొంటే ప్రపంచ వాణిజ్యం, సముద్ర రవాణాపై కూడా సానుకూల ప్రభావం పడే అవకాశముందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి అమెరికా--ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చలపైనే కేంద్రీకృతమైంది. ప్రతిపాదిత ఒప్పందం అధికారికంగా ఖరారైతే పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ

# కొత్త పింఛన్ లొల్లి..

# అర్హుల కళ్లలో 'చేయూత' ఆశలు!

**ఈ నెల 15 నుంచి 'చేయూత' పింఛన్ల మంజూరుకు ముహూర్తం**
**25 వేలకుపైగా కొత్త దరఖాస్తులు.. కేటాయించే యూనిట్లు ఎన్నో?**
**జిల్లాలో ఇప్పటికే 1,44,773 మంది లబ్ధిదారులు.. పెండింగ్‌లో 3,320 దరఖాస్తులు**




నిర్మల్ ఆగస్టు 2 తెలంగాణ వెన్నెల వాక్కు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'చేయూత' పింఛన్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులైన నిరుపేదల కళ్లలో కొత్త ఆశలు చిగురించాయి. ఈ నెల 15వ తేదీ నుంచి నూతన పింఛన్ల మంజూరు ప్రక్రియకు అధికారికంగా శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించడమే కాకుండా, ఈ మేరకు నిర్మల్ జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశాలు సైతం జారీ అయ్యాయి. దీంతో జిల్లా పరిపాలన యంత్రాంగం క్షేత్రస్థాయి పరిశీలన, దరఖాస్తుల క్రోడీకరణ పనుల్లో వేగం పెంచింది. అయితే, జిల్లాలో కొన్నేళ్లుగా కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడంతో దరఖాస్తుదారుల సంఖ్య కొండలా పేరుకుపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేయబోయే కోటా ఎంత? అందులో తమకు అవకాశం దక్కుతుందో లేదో అనే తీవ్ర ఉత్కంఠ, ఆందోళన ప్రతి ఒక్క ఆశావహుడిలో నెలకొంది.

**ప్రస్తుత లబ్ధిదారుల వివరాలు**

జిల్లా అధికారిక గణాంకాల ప్రకారం ప్రస్తుతం నిర్మల్ జిల్లా పరిధిలో మొత్తం 1,44,773 మంది సామాజిక భద్రత (చేయూత/ఆసరా) పింఛన్ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. వివిధ కేటగిరీల వారీగా వివరాలను పరిశీలిస్తే.. జిల్లాలో అత్యధికంగా బీడీ కార్మికుల పింఛన్లు 61,933 మందికి, వితంతు పింఛన్లు 35,664 మందికి, వృద్ధాప్య పింఛన్లు 33,890 మందికి అందుతున్నాయి. వీరికి తోడు దివ్యాంగుల పింఛన్లు 9,822 మందికి, ఒంటరి మహిళల పింఛన్లు 2,093 మందికి, గీత కార్మికుల పింఛన్లు 266 మందికి క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్నారు. అదనంగా ఫైలేరియా బాధితులు 221 మందికి, డయాలసిస్ పేషెంట్లు 110 మందికి కూడా ప్రతి నెలా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది.

**323 అక్రమ పింఛన్ల తొలగింపు.. 25 వేలకు పైగా దరఖాస్తులు**

ఇప్పటికే పింఛన్లు పొందుతున్న పాత లబ్ధిదారులకు తోడు కొత్త పింఛన్ల కోసం జిల్లా వ్యాప్తంగా అర్జీలు కుప్పలు తెప్పలుగా వచ్చి పడ్డాయి. 2019 నుంచి ఆసరా ఆన్‌లైన్ పోర్టల్‌లో కొత్త దరఖాస్తుల స్వీకరణ నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహించిన 'ప్రజాపాలన' సభల్లో వచ్చిన 25 వేలకు పైగా దరఖాస్తులతో పాటు, అధికారుల పరిశీలన పూర్తయి సిఫార్సు చేసిన 3,320 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు 'మంత్ర' యాప్ ద్వారా లైవ్ అథెంటికేషన్ నిర్వహించి జిల్లాలో అక్రమంగా పింఛన్ పొందుతున్న 323 మంది అనర్హులను అధికారులు జాబితా నుంచి తొలగించారు. ఈ దరఖాస్తులను మండల స్థాయిలో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల సంయుక్త ఆధ్వర్యంలో పరిశీలిస్తూ వడపోత ప్రక్రియ చేపట్టారు.

**యూనిట్లు తక్కువ.. అర్హులు ఎక్కువ!**

రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా సుమారు 2 లక్షల 'చేయూత' పింఛన్లను మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించింది. అలాగే 'లైవ్ అథెంటికేషన్' ప్రక్రియ ద్వారా అర్హత లేని వారిని తొలగించి, ఆ స్థానాల్లో కొత్తవారికి అవకాశం కల్పిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ 2 లక్షల పింఛన్లలో జిల్లా వారీగా ఎంత కోటా కేటాయించారు? ఆమోదించిన లబ్ధిదారుల జాబితాలు ఏమిటి? అనే వివరాలు ఇప్పటివరకు అధికారికంగా అందుబాటులోకి రాలేదు. దరఖాస్తుల సంఖ్యతో పోలిస్తే జిల్లాకు వచ్చే యూనిట్లు చాలా పరిమితంగానే ఉండే అవకాశం కనిపిస్తోంది. క్షేత్రస్థాయికి కోటా కేటాయింపులు, అధికారిక ఉత్తర్వులు వస్తే తప్ప జిల్లాలో ఎంతమందికి కొత్తగా పింఛన్ భాగ్యం దక్కుతుందో స్పష్టత రాదు.

## 'నషా ముక్త్ యువ వికసిత్ భారత్'కు శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ 'నషా ముక్త్ యువ వికసిత్ భారత్' జాతీయ కార్యక్రమాన్ని సోమవారం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యానికే కాకుండా కుటుంబ వ్యవస్థకు, సమాజానికి, దేశ భవిష్యత్తుకు కూడా తీవ్ర ప్రమాదమని అన్నారు. డ్రగ్స్ బారిన పడిన యువత తమ ప్రతిభను కోల్పోవడమే కాకుండా నేరాలకు, హింసకు, అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల డ్రగ్స్‌పై పోరాటాన్ని కేవలం ప్రభుత్వ బాధ్యతగా కాకుండా ప్రజలందరి ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు.

దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని ప్రధాని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 100 వారాల పాటు దేశవ్యాప్తంగా నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి ఆదివారం ప్రత్యేకంగా "నషా ముక్త్ దినం"గా పాటిస్తూ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, గ్రామాలు, పట్టణాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ ప్రదర్శనలు, క్విజ్ పోటీలు, ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు, వీధి నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించనున్నారు. యువత తమ స్నేహితులను కూడా వ్యసనాలకు దూరంగా ఉంచేలా ప్రోత్సహించాలని ప్రధాని సూచించారు.

ఈ ఉద్యమంలో ప్రభుత్వం మాత్రమే కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు, ఎన్జీవోలు, క్రీడాకారులు, వైద్యులు, సామాజిక సంస్థలు చురుకుగా పాల్గొనాలని ప్రధాని కోరారు. సమాజం మొత్తం కలిసి పనిచేస్తేనే డ్రగ్స్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

పిల్లల ప్రవర్తనలో వచ్చే చిన్నచిన్న మార్పులను ముందుగానే గుర్తించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ప్రధాని పేర్కొన్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వ్యసనాలకు దూరంగా ఉంచవచ్చని సూచించారు. భయపెట్టడం కాకుండా అవగాహన కల్పించడం, ప్రేమతో మార్గనిర్దేశం చేయడం అవసరమని తెలిపారు.డ్రగ్స్ బారిన పడిన వారిని సమాజం చిన్నచూపు చూడకూడదని, వారికి కౌన్సెలింగ్, వైద్యసేవలు, పునరావాసం కల్పించడం ద్వారా తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావాలని ప్రధాని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా పునరావాస కేంద్రాలను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, సరిహద్దు భద్రతా దళాలు, రాష్ట్ర పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ప్రధాని వెల్లడించారు. డ్రగ్స్ సరఫరాను అడ్డుకోవడంతో పాటు వాటి వినియోగాన్ని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు కూడా సమానంగా అవసరమని చెప్పారు.సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, రేడియో, టెలివిజన్, ప్రజామాధ్యమాలు, వీధినాటకాలు, సదస్సులు, యువజన సమావేశాల ద్వారా ఈ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో యువతకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు.వ్యసనాలకు దూరంగా ఉండే యువతే దేశానికి నిజమైన సంపద అని ప్రధాని అన్నారు. క్రీడలు, యోగా, సంగీతం, సాహిత్యం, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో యువత తమ ప్రతిభను చాటుకోవాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు."డ్రగ్స్ బారిన పడకుండా మన యువతను కాపాడుకోవడం అంటే భారతదేశ భవిష్యత్తును కాపాడుకోవడమే. వ్యసన రహిత యువశక్తితోనే 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలం. ప్రతి కుటుంబం, ప్రతి పాఠశాల, ప్రతి గ్రామం, ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలి" అని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

## వర్షాలు సమృద్ధిగా కురిసి.. పంటలు బాగా పండాలి



వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, ప్రాజెక్టులు నిండాలని, రైతులు పండించిన పంటలకు మంచి దిగుబడులు రావాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వెల్లడించారు.

బోనాలకు రాష్ట్ర పండుగ హోదా బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇచ్చింది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన బోనాలు, బతుకమ్మ వంటి తెలంగాణ పండుగలకు రాష్ట్రం ఏర్పడిన తర్వాత గౌరవం దక్కిందన్నారు. బోనాలను అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించి, ప్రతి ఏడాది ప్రభుత్వ నిధులతో ఘనంగా నిర్వహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టిందీ కేసీఆర్ ప్రభుత్వమేనని తెలిపారు.

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజా, గోల్కొండతో పాటు నగరంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించామని గుర్తు చేశారు. బోనాలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే పండుగ అని అన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రాధాన్యం

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే ఆధ్యాత్మిక ప్రాజెక్టు అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ సంకల్పంతో అత్యాధునిక సౌకర్యాలు, సాంప్రదాయ శిల్పకళ సమన్వయంతో యాదాద్రిని దేశంలోనే అత్యంత వైభవమైన ఆలయంగా తీర్చిదిద్దామని చెప్పారు.

యాదాద్రితో పాటు వేములవాడ, భద్రాచలం, ధర్మపురి, కొండగట్టు, జోగులాంబ, రామప్ప ఆలయాల అభివృద్ధికి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టిందన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు, రైతులకు సాగునీటి సౌకర్యాల కల్పనలో బీఆర్ఎస్ ప్రభుత్వం విశేషంగా కృషి చేసిందన్నారు.

పండుగలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని, అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, రైతుల పొలాలు పచ్చగా కళకళలాడాలని, ప్రజల జీవితాల్లో ఆనందం నిండాలని కోరుకుంటున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

# శాశ్వత భవనాల కోసం ఎదురుచూపులు

## అద్దె భవనాల్లోనే గురుకులాలు, కళాశాలలు



నిర్మల్, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఏడు గురుకుల పాఠశాలలు, ఏడు జూనియర్ కళాశాలలు, ఒక డిగ్రీ కళాశాలకు ఇప్పటికీ శాశ్వత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లోనే విద్యాబోధన కొనసాగుతోంది. సుమారు నాలుగు వేల మందికిపైగా విద్యార్థులు ఈ విద్యాసంస్థల్లో చదువుకుంటున్నప్పటికీ, వారికి శాశ్వత మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ముధోల్ బాలికల కళాశాల, జంగం (కుబీర్) బాలుర కళాశాల, సారంగాపూర్ బాలికల కళాశాల, నిర్మల్ బాలుర కళాశాల, లక్ష్మణచంద మండలం రాచాపూర్ కు మంజూరైన కళాశాల ప్రస్తుతం మామడ లో, ఖానాపూర్ బాలికల, బాలుర కళాశాలలు, చించోలి ఎక్స్‌రోడ్డు వద్ద డిగ్రీ కళాశాలతో పాటు జిల్లాలోని పలు బీసీ విద్యాసంస్థలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు వంటి మౌలిక వసతుల కొరత విద్యార్థులపై ప్రభావం చూపుతోందని తెలుస్తోంది.

జిల్లాలో ఈ విద్యాసంస్థలకు ఇప్పటివరకు శాశ్వత భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ కూడా పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో శాశ్వత భవనాల నిర్మాణంపై హామీలు ఇచ్చినప్పటికీ అవి అమలుకు నోచుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా భవనాల నిర్మాణానికి సంబంధించి స్పష్టమైన పురోగతి కనిపించకపోవడంతో విద్యార్థులు, తల్లి జదండ్రులు ఆశాభంగానికి గురవుతున్నారు. జిల్లాలో బీసీ జనాభా అధికంగా ఉండటంతో ఈ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం ప్రవేశాలు పెరుగు తున్నాయి. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగు ణంగా మౌలిక వసతులు కల్పించడంలో జాప్యం కొనసాగుతోంది. శాశ్వత భవనాలు అందుబాటు లోకి వస్తే విద్యా ప్రమాణాలు మెరు గుపడటంతో పాటు విద్యార్థులకు మెరుగైన వాతా వరణంలో చదువుకునే అవకాశం కలుగు తుందని విద్యావేత్తలు అభిప్రాయపడు తు న్నారు బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టేం దుకు ప్రభుత్వం తక్ష ణమే స్థల సేకరణ పూర్తి చేసి, నిధులు మంజూరు చేయాలని జిల్లాలో పలువురు కోరుతున్నారు.

### బీసీ విద్యార్థులపై ప్రభుత్వం నిర్లక్ష్యం: ఏంబడి చంద్రశేఖర్



బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు లేకపోవడం దుర దృష్టకరమని బీసీ సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఏంబడి చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్రంలో బీసీ జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో నిర్మల్ ఒకటైనా, ఇక్కడి బీసీ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

గత ప్రభుత్వం భవనాల నిర్మాణానికి హామీ ఇచ్చి అమలు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇప్పటివరకు కనీసం స్థల సేకరణ చేపట్టకపోవడం బాధాకరమన్నారు. బీసీ గురుకులాలు, కళాశాలలు, వసతి గృహాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి, స్థల సేకరణ పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# తరగతి గదిలో మొబైల్.. అవసరమా?

## ఆలోచించాల్సిన సమయం!

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బోధనకు ప్రాధాన్యం పెరగాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అనేక సంస్కరణలు చేపడుతోంది. మౌలిక సదుపాయాల కల్పన, ఆధునిక తరగతి గదులు, డిజిటల్ విద్య, ఆంగ్ల మాధ్యమం, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు కృషి జరుగుతోంది. అయితే ఈ ప్రయత్నాలన్నింటికీ అసలైన బలం తరగతి గదిలో జరిగే నాణ్యమైన బోధనే.




ప్రస్తుతం మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో విడదీయరాని భాగంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ప్రైవేట్ ఉద్యోగుల వరకు అందరూ తమ పనుల్లో మొబైల్‌ను వినియోగిస్తున్నారు. ఉపాధ్యాయులకు కూడా విద్యాశాఖ నుంచి వచ్చే అధికారిక సమాచారం, విద్యా కార్యక్రమాలకు సంబంధించిన సూచనలు, ఆన్‌లైన్ సమావేశాలు, అత్యవసర సమాచార మార్పిడికి మొబైల్ అవసరమే. అయితే బోధన సమయంలో వ్యక్తిగత మొబైల్ వినియోగం ఎంత వరకు ఉండాలి అనే అంశంపై ఇప్పుడు విద్యా వర్గాల్లో చర్చ జరుగుతోంది.

తరగతి గది అంటే విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దే స్థలం. ఉపాధ్యాయుడు చెప్పే ప్రతి మాట, చూపించే ప్రతి ఉదాహరణ విద్యార్థి ఆలోచనలను ప్రభావితం చేస్తుంది. అలాంటి సమయంలో బోధనకు మధ్యలో వ్యక్తిగత ఫోన్ కాల్స్, సందేశాలు లేదా ఇతర వ్యక్తిగత పనులు అంతరాయం కలిగిస్తే విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతినే అవకాశం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఒకసారి పాఠం మధ్యలో అంతరాయం ఏర్పడితే మళ్లీ విద్యార్థుల దృష్టిని పాఠంపై కేంద్రీకరించడం అంత సులభం కాదు.

అయితే ఈ అంశాన్ని ఒక వర్గాన్ని విమర్శించే కోణంలో చూడకూడదు. ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది మంది ఉపాధ్యాయులు అత్యంత నిబద్ధతతో పనిచేస్తూ అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రభుత్వ ఉపాధ్యాయుల కృషితో మంచి ఫలితాలు సాధిస్తున్న పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. వారి సేవలను గుర్తించడం కూడా అంతే అవసరం. కానీ ఎక్కడైనా కొద్ది చోట్ల బోధనకు అంతరాయం కలిగించే పరిస్థితులు ఉంటే వాటిని సరిదిద్దేందుకు వ్యవస్థాగత చర్యలు తీసుకోవడం విద్యార్థుల ప్రయోజనానికే ఉపయోగపడుతుంది.

దేశంలోని కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థల్లో పాఠశాల సమయం ముగిసే వరకు వ్యక్తిగత మొబైల్ వినియోగాన్ని పరిమితం చేసే అంతర్గత నిబంధనలు అమలులో ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఫోన్లను వినియోగించే విధంగా ఏర్పాట్లు చేస్తారు. దీని వల్ల ఉపాధ్యాయుల దృష్టి పూర్తిగా బోధనపై కేంద్రీకృతమవుతుందని ఆయా సంస్థలు భావిస్తున్నాయి. ఇదే తరహా విధానాలను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలా లేదా అనేది విద్యాశాఖ, ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రుల సంఘాలు కలిసి చర్చించి నిర్ణయించాల్సిన అంశం.

మరోవైపు నేటి విద్యా వ్యవస్థలో అనేక ప్రభుత్వ ఆదేశాలు, సమాచార మార్పిడి, యాప్‌ల వినియోగం కూడా మొబైల్ ద్వారానే జరుగుతున్నాయి. అందువల్ల పూర్తిగా మొబైల్‌ను నిషేధించడం కన్నా, బోధన సమయంలో వ్యక్తిగత వినియోగాన్ని పరిమితం చేసి, అధికారిక అవసరాలకు మాత్రమే వినియోగించే విధంగా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

విద్యార్థులు తమ ఉపాధ్యాయులను ఆదర్శంగా భావిస్తారు. ఉపాధ్యాయుడు తరగతి గదిలో చూపే క్రమశిక్షణ విద్యార్థులపై కూడా ప్రభావం చూపుతుంది. ఉపా ధ్యాయు డు పాఠంపై పూర్తిగా దృష్టి పెట్టిన ప్పుడు విద్యార్థుల్లో కూడా చదువుపై ఆసక్తి పెరుగుతుంది. అదే విద్యా నాణ్యతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి అంటే కేవలం కొత్త భవనాలు నిర్మించడం, ఫర్నిచర్ అందించడం లేదా డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయడం మాత్రమే కాదు. వాటితో పాటు బోధనకు అనుకూలమైన వాతావరణం, క్రమశిక్షణ, ఉపాధ్యాయుల నిబద్ధత, విద్యార్థుల అభ్యాసంపై నిరంతర శ్రద్ధ కూడా సమానంగా అవసరం. ఈ అంశాలన్నీ కలిసివచ్చినప్పుడే ప్రభుత్వ పాఠశాలలు నిజమైన అర్థంలో ఆదర్శ విద్యాలయాలుగా నిలుస్తాయి.

ఈ నేపథ్యంలో బోధన సమయంలో మొబైల్ వినియోగంపై విద్యాశాఖ సమగ్ర మార్గదర్శకాలు రూపొందించడం, అవసరమైతే ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని అమలు చేయడం, పాఠశాలల్లో విద్యా వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ విద్య బలపడాలంటే భవనాలు మాత్రమే కాదు... తరగతి గదిలో గడిచే ప్రతి నిమిషం విద్యార్థి భవిష్యత్తుకు అంకితం కావాలి. అదే ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే మార్గం.



సీనియర్ జర్నలిస్ట్ వెంకగారి భూమయ్య విశ్లేషణ
9848559863

# నిర్మల్ లో తొలి బోనాల సంబరం: బంగల్పేట మహాలక్ష్మి ఆలయానికి భక్తుల పోటెత్తు!

- ఆషాఢ మాస తొలి ఆదివారం సందర్భంగా శివసత్తుల సిగాలు, పోతురాజుల విన్యాసాలు
- భక్తులతో కిటకిటలాడిన శ్రీనగర్ కాలనీ మారమ్మ ఆలయం, పద్మశాలి సంఘం బోనాల ఊరేగింపు



నిర్మల్, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆషాఢ మాస తొలి బోనాల పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన బంగల్పేట శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఆదివారం భక్తజనసందోహంతో కిటకిటలాడింది. ఉదయం నుంచే మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. నిష్టతో తయారు చేసిన నైవేద్యాలతో అమ్మవారికి కుంకుమార్చనలు, మహా మంగళహారతులు ఇచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక దర్శన మార్గాలు ఏర్పాటు చేశారు.

శ్రీనగర్ కాలనీలో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు:

పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో శివ మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. డప్పుల వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ భక్తుల ఊరేగింపు కంటికి రెప్పలా సాగింది. పద్మశాలి సంఘం సభ్యులు, కాలనీ మహిళలు నెత్తిపై బోనాలు ధరించి ఊరేగింపుగా వెళ్లి మారమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

# బాసరలో గోదావరి పుష్కరాల రోడ్లకు 27 కోట్ల నిధులు మంజూరు: ఎమ్మెల్యే పవార్

- నియోజకవర్గాన్ని రవాణా పరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది
- 2027 నాటికి బాసర పుష్కర ఘాట్లను మోడల్ గా తీర్చిదిద్దుతామన్న పవార్ రామారావు పటేల్



భైంసా/బాసర, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): రానున్న గోదావరి మహా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని బాసర పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రధాన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం 27 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని ముధోల్ శాసనసభ్యుడు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. ఆదివారం భైంసాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి శాఖల ద్వారా ఈ నిధులతో రోడ్డు విస్తరణ, బిటి రోడ్ల నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

రహదారుల వారీగా నిధుల కేటాయింపు వివరాలు:

మండలంలో ఓని నుండి బాసర రోడ్డుకు 2.55 కోట్లు, గన్నోరా నుండి ఓని రోడ్డుకు 2 కోట్లు, పిడబ్ల్యూడీ రోడ్డు నుండి మహంకాళి ఆలయ రోడ్డుకు 1.20 కోట్లు, కిర్గుల్ బి నుండి బాసర కనెక్టివిటీకి 2.80 కోట్లు, బాసర స్టేషన్ నుండి నావేగావ్ రోడ్డుకు 1.35 కోట్లు, మల్కాపూర్ మీదుగా బాసర రోడ్డుకు 2.70 కోట్లు మంజూరయ్యాయన్నారు. అలాగే బాసర ప్రధాన రహదారి నుండి పుష్కర ఘాట్ వరకు 4 లేన్ల నిర్మాణానికి 8.50 కోట్లు, బిద్రెల్లి నుండి ధర్మబాద్ 2 లేన్ రోడ్డుకు 4.65 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. 2027 నాటికి పనులన్నీ పూర్తి చేస్తామన్నారు.

# ఆగస్టు 18 లోపు గౌడ కులస్తుల హామీలు అమలు చేయాలి:



హైదరాబాద్/నిర్మల్, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను ఆగస్టు 18 లోపు నెరవేర్చాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సా గౌడ్ హెచ్చరించారు. హైదరాబాద్ లోతుకుంటలో నిర్వహించిన మోకుదెబ్బ జాతీయ పొలిట్ బ్యూరో సమావేశంలో ఆయన మాట్లాడారు.

జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. మద్యం దుకాణాల్లో 50 శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని, గీత కార్మికులకు 10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. తాటి, ఈత వనాల పెంపకానికి 5 ఎకరాల భూమి కేటాయించాలన్నారు. సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు రాగుల సిద్దిరాములు, బాలరాజ్ గౌడ్ పాల్గొన్నారు.




## రెండేళ్లుగా మూతపడిన ఆధార్ కేంద్రం.. ప్రజలకు తప్పని తిప్పలు
## ప్రతి చిన్న సేవకూ జిల్లా కేంద్రానికే పరుగులు.. సమయం, డబ్బు రెండూ వృథా
## తక్షణమే ఆధార్ కేంద్రం పునరుద్ధరించాలని మండల ప్రజల డిమాండ్

దిలావర్‌పూర్, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆధార్ కార్డు నేడు ప్రతి పౌరుడి జీవితంలో అత్యంత కీలక పత్రంగా మారింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలనుంచిరేషన్ పింఛన్లు, ఆరోగ్య సేవలు, విద్య, బ్యాంకింగ్, రైతు పథకాలు, జనన నమోదులు వరకు దాదాపు ప్రతి సేవకు ఆధార్ తప్పనిసరి అయిం ది.ఇలాంటిపరిస్థితుల్లో నిర్మల్ జిల్లాదిలావర్‌పూర్ మండల కేంద్రంలో గత రెండేళ్లుగా ఆధార్ సేవా కేంద్రం లేకపోవడం వేలాదిమంది ప్రజలకు తీవ్ర ఇబ్బందులనుకలిగిస్తోంది.మండల కేంద్రంలో అందా ల్సిన సేవల కోసం ప్రజలు ప్రతిసారీ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుండటంతో తీవ్ర అసంతృ ప్తివ్యక్త మవుతోంది.

మండలంలోని దిలావర్‌పూర్‌తో పాటు పలు గ్రామాల ప్రజలు కొత్త ఆధార్ నమోదు, పేరు, చిరునామా మార్పులు, మొబైల్ నంబర్ అనుసంధానం, బయోమెట్రిక్ అప్‌డేట్, పిల్లల ఆధార్ నమోదు వంటి ప్రతి చిన్న పని కోసం నిర్మల్ జిల్లా కేంద్రాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ఒక్క పని కోసం వెళ్లినా గంటల తరబడి క్యూల్లో నిలబడాల్సి వస్తోందని, కొన్ని సందర్భాల్లో సర్వర్ సమస్యలు లేదా టోకెన్లు ముగిసిపోవడంతో పని పూర్తికాక మళ్లీ వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

ప్రస్తుతం ఈ సమస్యతో ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు చిన్నారుల తల్లిదండ్రులు, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులే. నవజాత శిశువులకు ఆధార్ నమోదు చేయించడం నుంచి పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ వరకు ప్రతిదానికీ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్ల కోసం ఆధార్ వివరాల్లో సవరణలు చేయించుకోవాలన్నా ఇదే పరిస్థితి ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని బాధితులు చెబుతున్నారు.

వ్యవసాయ పనులు, కూలీ పనులు చేసుకునే ప్రజలు ఒక్కరోజు పని మానుకుని జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి రావడంతో రోజువారీ ఆదాయాన్ని కూడా కోల్పోతున్నారు. రవాణా ఖర్చులు, భోజన ఖర్చులు, రోజంతా సమయం వృథా కావడం పేద కుటుంబాలపై అదనపు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ కావాల్సిన సమయంలో ఒక ప్రాథమిక సేవ కోసం ఇంత ఇబ్బంది పడాల్సి రావడం బాధాకరమని అంటున్నారు.

గతంలో దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఆధార్ సేవలు అందుబాటులో ఉండేవి. అయితే రెండేళ్ల క్రితం ఆ కేంద్రం నిలిచిపోయిన తర్వాత దానిని పునరుద్ధరించాలంటూ ప్రజలు పలుమార్లు జిల్లా అధికారులకు, సంబంధిత శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. అప్పటి తహసీల్దార్ కూడా ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు స్థానికులు చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.

మండల కేంద్రంలోనే ఆధార్ సేవా కేంద్రాన్ని పునరుద్ధరిస్తే వేలాది మంది ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రతి చిన్న పనికీ జిల్లా కేంద్రానికి వెళ్లే అవసరం తప్పి ప్రజల సమయం, డబ్బు ఆదా అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి దిలావర్‌పూర్ మండల కేంద్రంలో శాశ్వత ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండల ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. సమస్యను మరింత ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలను ఏకం చేసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యపై జిల్లా అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు ఉపశమనం కల్పించాలని మండలవాసులు కోరుతున్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలింకర్ గంగాధర్ కుటుంబాన్ని పరామర్శించిన విఠల్ రెడ్డి



భైంసా, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలింకర్ గంగాధర్ సతీమణి ఇటీవల అనారోగ్యంతో పరమపదించడంతో విషయం తెలుసుకున్న ముధోల్ మాజీ శాసన సభ్యుడు జి. విఠల్ రెడ్డి ఆదివారం గంగాధర్ నివా సానికి వెళ్లారు. మరణించిన ఆయన సతీమణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గంగాధర్ ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ధైర్యాన్ని చెప్పారు. విఠల్ రెడ్డితో పాటు మాజీ జెడ్పీటీసీ ఉత్తమ్ భలేరావు, గైక్వాడ్ సాయినాథ్ ఝరి తదితరులు ఉన్నారు.

## గొల్లమాడలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి మున్నూరు కాపు సంఘం సన్మానం



నర్సాపూర్ (జి), ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): నర్సాపూర్ (జి) మండలం గొల్లమాడ గ్రామంలో మున్నూరు కాపు సంఘం భవనంలో ముధోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. నూతన మున్నూరు కాపు కుల సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయించాలని కుల పెద్దలు ఆయనకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా విఠల్ రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్న వసంత, మాజీ సర్పంచ్ పాపేన్ రాజేశ్వర్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చెన్న రాములు, ఉత్తమ్ భలేరావు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న 'జైల్ భరో' ను జయప్రదం చేయండి: సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మన సురేష్

### – ఖానాపూర్ లో మధ్యాహ్న భోజన వర్కర్ల జిల్లా స్థాయి సమావేశం నిర్వహణ
### – మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 10,000 రూపాయలకు పెంచాలని డిమాండ్



ఖానాపూర్, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే 'జైల్ భరో' నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేష్ పిలుపునిచ్చారు. ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని పార్కులో మధ్యాహ్న భోజన వర్కర్ల యూనియన్ జిల్లా స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ చట్టాలను సవరిస్తున్న కేంద్రానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి:

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. రాధా మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులకు ఎన్నికల హామీ ప్రకారం నెలకు 10 వేల రూపాయల వేతనం తక్షణమే చెల్లించాలన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ ఛార్జీలను 25 రూపాయలకు పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 2 నెలల జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బొడ్డు గోదావరి, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, వందన పాల్గొన్నారు.

## అష్ట గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు: సర్పంచ్ రావుల లావణ్య



ముధోల్, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండలం అష్ట గ్రామంలోని వివిధ వార్డులలో పారిశుధ్య పనులను సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మరంగా చేపట్టారు. మురుగు కాలువలను శుభ్రం చేసి నిల్వ ఉన్న మట్టిని పారిశుధ్య వాహనాల్లో తొలగించే పనులను పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలు చెత్తను కాల్వల్లో వేయకుండా ఇంటింటికీ వచ్చే చెత్త బండిలోనే వేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా దోమలు ప్రబలకుండా ప్రతి వార్డులోనూ మురుగు కాలువలను శుభ్రపరుస్తున్నామన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు పంచాయతీకి సహకరించాలని కోరారు.

## స్నేహితుల దినోత్సవేళ నెరవేరిన స్నేహబంధం: 50 వేల ఆర్థిక సాయం!



దిలావర్‌పూర్, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): స్నేహం అంటే కేవలం శుభాకాంక్షలు చెప్పుకోవడమే కాదు.. కష్టకాలంలో కొండంత అండగా నిలవడమే నిజమైన స్నేహమని దిలావర్‌పూర్ పూర్వ విద్యార్థులు నిరూపించారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన 1999--2000 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ ఉదారతతో స్నేహబంధం విలువను మరోసారి ఎలుగెత్తి చాటారు. తమతో పాటు చదువుకున్న సహ విద్యార్థిని సంయుక్త భర్త ఇటీవల అకాల మరణం చెందడంతో ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది.

కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం: ఆదివారం నిర్వహించిన స్నేహితుల దినోత్సవ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ. 50,000 నగదు ఆర్థిక సహాయాన్ని సంయుక్తకు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న స్నేహితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అన్నారు. భవిష్యత్తులోనూ సంయుక్త కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు. మిత్రుల చొరవను మండల ప్రజలు, పలువురు ప్రముఖులు విశేషంగా కొనియాడారు.

## రాష్ట్ర గెజిటెడ్ అధ్యాపక సంఘం కార్యదర్శిగా డాక్టర్ రవికుమార్ ఏకగ్రీవ ఎన్నిక!




భైంసా/నిర్మల్, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం (టిజిసిజిటిఎ) రాష్ట్ర కార్యదర్శిగా భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ప్రముఖ అధ్యాపకుడు డాక్టర్ ఖ. రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోని ఫ్యాకల్టీ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నికల అధికారులు రాజారెడ్డి, సులేమాన్ లు రవికుమార్‌కు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ విషయాన్ని నిర్మల్ జిల్లా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రఘునాథ్, కట్ట రమేష్ రెడ్డి వెల్లడించారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి:

రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ ఖ. రవికుమార్‌ను కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఖ. సూర్య సాగర్, డాక్టర్ వీ. శంకర్, డాక్టర్ ఖ. మురళి, +. సుభాష్ తదితరులు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న గెజిటెడ్ అధ్యాపకుల సంక్షేమానికి, విద్యా రంగంలో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం శ్రమిస్తానని వెల్లడించారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు, అధ్యాపక వర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బాసరలో ఆగస్టు 9న అంగరంగ వైభవంగా 'ఊరు పండుగ' ఉత్సవాలు



బాసర, ఆగస్టు 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలో ప్రసిద్ధ గ్రామ దేవతల ఉత్సవమైన 'ఊరు పండుగ'ను వచ్చే ఆదివారం అనగా ఆగస్టు 9న గ్రామస్థులంతా కలిసి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం బాసర పెద్దలు, గ్రామ కమిటీ సభ్యులు, యువకులు డప్పు చప్పుళ్లతో ఊరంతా ఊరేగింపుగా వెళ్లి బాసరౌలిలోని మహాలక్ష్మమ్మ, పోచమ్మ, మారెమ్మ, పూత లింగరాజుల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు జరిపి పండుగ ఆహ్వానాలను పంచుకున్నారు.

ఆగస్టు 9న గ్రామదేవతలకు సామూహిక పూజలు:

రాబోయే ఆదివారం నాటి ఊరు పండుగ సందర్భంగా గ్రామ ప్రజలు, మహిళలు, పిల్లలు కుటుంబ సమేతంగా తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యాలు, బోనాలు సమర్పించనున్నారు. ఊరు పండుగ జరుపుకోవడం ద్వారా గ్రామ ప్రజలందరికీ ఆరోగ్యాలు కలగాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవార్లను వేడుకున్నట్లు పెద్దమనుషులు తెలిపారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com